క్లుప్తంగా

ప్రజలను చైతన్యవంతం చేయాలి

సీపీఐ నాయకుడు జంగాల అజయ్‌కుమార్



లక్ష్మీపురం: ప్రజలను చైతన్యవంతం చేయడంలో కళారూపాల పాత్ర కీలకమని సీపీఐ నాయకుడు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ అధ్యక్షతన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పాటలు, కళారూపాల శిక్షణ శిబిరం శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళారూపాలు, అభ్యుదయ గేయాలు ప్రజా చైతన్యం కోసం, అసాంఘిక, మతోన్మాద, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా విరోచితంగా ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేసిన ప్రజానాట్యమండలి సుదీర్ఘంగా తన ఆటపాటలతోటి ప్రజలు చైతన్యపరిచిందని అన్నారు. కార్యక్రమంలో ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఆఫీస్ బేరర్స్ రామకృష్ణ, ఆరేటి రామారావు, పిచ్చయ్య, బొల్లిమంత కృష్ణ, నసిర్, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

విదేశీ వైద్య విద్యార్థులకు ఐఎంఏ బాసట



గుంటూరు మెడికల్: కొన్ని నెలలుగా విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యకు కారణాలను అధ్యయనం చేసినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం మీడియాతో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఐదేళ్లుగా కోవిడ్-19, రష్యా - ఉక్రయిన్ యుద్ధం వంటి ప్రపంచంలో నెలకొన్న అసాధరణ పరిస్థితులు వైద్య విద్యార్థులను గందరగోళ పరిస్థితికి తీసుకెళ్లాయన్నారు. పది నెలలుగా ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి పూర్తిగా ఏర్పడకపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఇప్పుడు వైద్య మండలి ఒక స్థాయిలోకి ఏర్పడిందని, సమస్యను సత్వరమే పరిష్కరించాల్సి ఉందన్నారు. అసాధారణ పరిస్థితులను నివృత్తి చేసే విధంగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనేక మార్గదర్శకాలను రాష్ట్ర మండళ్లకు సూచించిందన్నారు. ఆ మార్గదర్శకాలను తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, అక్కడి వైద్య విద్యార్థులకు వైద్య మండలి నమోదు ప్రక్రియలను పూర్తి విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ఒక సంవత్సరంగా ఉన్న ఇంటర్న్‌షిప్ ఏపీలో మాత్రం రెండు మూడు సంవత్సరాలు విధించడం వల్ల వైద్య విద్యార్థులు విద్యా సంవత్సరాలను నష్టపోయే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈనెల 1న నేషనల్ మెడికల్ కమిషన్‌కు బీహార్ వైద్య మండలి రాసిన లేఖలో ఇంటర్న్‌షిప్ దానికి సంబంధిత విషయాలు రాష్ట్ర మండళ్ల పరిధిలోనివని, చేసిన సూచనను పరిగణలోకి తీసుకుని వెంటనే ఈ వివాదానికి తెరదించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు. వైద్య విద్యార్థులకు నష్టం జరగకముందే వైద్య విద్య సంచాలకులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి తగు దిశ, నిర్దేశం చేయాలని ఐఎంఏ తరుపున అభ్యర్థిస్తున్నట్లు డాక్టర్ నందకిషోర్ కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధం

గుంటూరు మెడికల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంతో ఆడపిల్లల నిష్పత్తిని పెంచవచ్చన్నారు. ఆడపిల్లలపై వివక్షత విడనాడితే పురుషులతో సమానంగా రాణిస్తారన్నారు. స్కానింగ్ చేసే అధికారం కేవలం రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులకు మాత్రమే ఉంటుందని, ఆర్‌ఎంపీలకు స్కానింగ్‌కు రిఫర్ చేసే అధికారం లేదన్నారు. ఆ విధంగా చేస్తే చట్ట ఉల్లంఘనేనని హెచ్చరించారు.

చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష అధ్యక్షతన ఉద్యోగుల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. జూన్ 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘానికి మద్దతు తెలిపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోతురాజు, ఫిరంగిపురం యూనిట్ కార్యదర్శి కె.దాసు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. రైతుకు రక్ష



మట్టి నమూనాల సేకరణలో ఏవో అరుణకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది

- భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు
- నియోజకవర్గంలో లక్ష్యంగా నమూనాల సేకరణ

ప్రత్తిపాడు: ఎండల తీవ్రత తగ్గింది. ముందుగానే వానలు పలకరిస్తున్నాయి. రైతుల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఎన్ని వేల ఎకరాల్లో సాగు భూమి ఉందనేది ప్రధానం కాదు. సారవంతమైన భూమి ఎంత ఉన్నది అనేదే ముఖ్యమంటున్నారు అధికారులు. భూసార లోపాలతో భూమి తన సహజత్వాన్ని కోల్పోతుంది. మానవులకు పోషకాహారం ఎంత ముఖ్యమో.. నేలకు కూడా పోషక విలువలూ అంతే ముఖ్యం. అవి సరిగా లేకుంటే ఆ ప్రభావం మొక్క పెరుగుదలపై పడుతుంది. అందువల్లభూమిలో పోషక విలువలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకుంటే అందుకు తగినట్లుగా మనం భూమిని ఆరోగ్యకరంగా మలుచుకోవచ్చు. అనువైన పంటను సాగు చేసుకోవచ్చు. ప్రస్తుతం నియోజకవర్గంలో భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ ప్రక్రియ మొదలయ్యింది.

భూసార పరీక్ష అంటే..

భూసార పరీక్ష అంటే నేల భౌతిక, రసాయనిక లక్షణాలు తెలియజేసే కొలమానం. పొలం నుంచి వివిధ ప్రదేశాలలో సేకరించిన మట్టిని పలు భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి లక్షణాలను తెలుసుంటారు. భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలు.. పొలంలో వివిధ రకాల పోషకాల స్థాయిలను తెలుసుకోవచ్చు. భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మపోషకాలైన జింక్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, నత్రజని, భాస్వరం, పొటాషియం, గంధకం, సున్నం స్థాయిలు ఏయే మోతాదుల్లో ఉన్నాయో తెలుస్తుంది. దీంతో పాటు నేల ఉదజని శాతాన్ని తెలుసుకోవచ్చు. ఎరువులను ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలన్నది తెలుసుకోవచ్చు. చౌడు స్థాయిని సరి చూసుకోవచ్చు. నేలసారం పెరగడంతో పాటు పంట దిగుబడులు అధికమవుతాయి. పరీక్షలు నిర్వహించిన తరువాత వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తే నేల సారం పెరిగి, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

అన్ని మండలాల్లో..

2025-26 సంవత్సరానికి సంబంధించి సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ స్కీం పీఎం ఆర్‌కేవీవై కింద మట్టి నమూనాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమయ్యింది. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు మండలాలకు టార్గెట్‌లు విధించారు. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలంలో 830, పెదనందిపాడులో 480, వట్టిచెరుకూరులో 820, కాకుమానులో 1,150, గుంటూరు రూరల్‌లో 520 మట్టి నమూనాలను ఆయా మండలాల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సేకరించి, పరీక్షలకు పంపనున్నారు. పరీక్షల అనంతరం పూర్తి వివరాలను పొందుపరిచి కార్డులు అందించనున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుమారుగా 57,223 మంది రైతులుండగా.. సాగు భూమి 34 వేల హెక్టార్లలో ఉంది.

అన్ని గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ..



ఈ ఏడాది ప్రత్తిపాడు మండలంలో 800కు పైగా మట్టి నమూనాలను సేకరించనున్నాం. ఇప్పటికే నమూనాల సేకరణ మొదలయ్యింది. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం వంటివి నిర్ణీత మోతాదులో వినియోగిస్తే మెరుగైన ఫలితాలుంటాయి. రైతులు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకునేందుకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించవచ్చు.

– కె.అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



వైఎస్ జగన్‌తో సాంబశివరావు, ఆయన కుమారుడు సురేంద్ర, బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: టీడీపీ నాయకుడు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎం.సాంబశివరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మురుకుట్ల సురేంద్ర తండ్రి మురుకుట్ల సాంబశివరావును గతనెల 30వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ద్విచక్రవాహనంపై వెంబడించి వెనుక నుంచి ఢీకొట్టాడు. కింద పడిన సాంబశివరావుపై దాడికి పాల్పడడం, అతను తీవ్ర గాయాల పాలవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ బాధితుడు సాంబశివరావు, అతని కుమారుడు సురేంద్రతో కలిసి వైఎస్ జగన్‌ను కలిశారు. టీడీపీ నాయకుడు చేసిన దాడి తీరు, పూర్వాపరాలను బాధితులు వైఎస్ జగన్‌కు వివరించారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారికి భరోసానిచ్చారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

దేశ త్రివిధ దళాల సేవలు ప్రశంసనీయం



ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఇమ్మానియేల్

పెదకాకాని: భారతదేశ త్రివిధ దళాల సేవలు ప్రశంసనీయమని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఇమ్మానియేల్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా హెల్ప్ ఫౌండేషన్, ఎంజీఎస్ ఐటీఐ విద్యాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తక్కెళ్లపాడు కళాశాల నుంచి ఉప్పలపాడు సెంటర్ వరకు 100 మీటర్ల జాతీయ జెండా, జాతీయ జెండాలతో తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టికరిపించిన సందర్భంగా భారతదేశ త్రివిధ దళాలకు మద్దతుగా వారి పోరాటాలకు సంఘీభావంగా తిరంగా యాత్ర చేపట్టామని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడు తల ఎత్తుకుని గర్వించేలా త్రివిధ దళాలు పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడులు చేశాయన్నారు. ర్యాలీలో విద్యార్థులు 'భారత మాతాకీ జై.. వీర మరణం పొందిన అమరవీరులకు జోహార్లు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వ్యాపార వేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: గడిచిన అయిదేళ్ల కాలంలో ప్రజలకు అండగా నిలిచి.. వారి అభ్యున్నతికి పాటుబడిన వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సభకు పార్టీ సీనియర్ నాయకులు పిచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు. మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జిల్లా, గ్రామ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలు గడుస్తున్నా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. మంచి ప్రభుత్వమని చెప్పుకొనే కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పట్ల ఆ పార్టీ కార్యకర్తల్లోనే తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకుని కూటమి నాయకులు కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. అందరూ ఐక్యంగా ఉండి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు, వివిధ పదవుల భర్తీపై చర్చించారు. పలువురు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్. నల్లమోతు రూత్ రాణి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య, నాయకులు చింతలపూడి మురళీకృష్ణ, షేక్.నాజర్, బొనిగల వేణుప్రసాద్, బొనిగల రాజారావు, వట్టిప్రోలు రంగారావు, చాగంటి మురళీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ నాయకులు

జన ఆరోగ్య యోజనకు దరఖాస్తు నేడు

పెదకాకాని: ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన జన ఆరోగ్య యోజన పథకానికి పేర్లు నమోదు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రామాంజి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వెనిగండ్ల మైత్రి కల్యాణ మండపంలో శనివారం ఈ పథకానికి నమోదు ప్రక్రియ జరుగుతుందని అన్నారు. నమోదుకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబరు తీసుకు రావాలన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. నమోదైన వారు భవిష్యత్తులో రూ.5లక్షల విలువైన వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి తెలియజేశారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ప్రత్తిపాడు: ఉన్నత విద్యను అభ్యసించడంతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో, గొట్టిపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో అందుబాటులో ఉన్న వివిధ రకాల కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస అర్హత పదితో పాటు 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు.

నారాకోడూరులో కేంద్రబృందం పర్యటన

గ్రామాభివృద్ధికి అవసరమైన సాధ్యాసాధ్యాల పరిశీలన



స్థానిక అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు పీవీ ప్రవీణ్, కేఎస్ నేల్తా

చేబ్రోలు: మండలం నారాకోడూరు గ్రామంలో డిజిటల్, స్మార్ట్ గ్రామ అభివృద్ధికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నలుగురు సభ్యుల కేంద్ర బృందం శుక్రవారం పర్యటించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో కేంద్ర ప్రభుత్వం టెలి కమ్యూనికేషన్ డైరెక్టర్లు పీవీ ప్రవీణ్, డైరెక్టర్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ కేఎస్ నేల్తా, డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ అతిక్యు అహ్మద్, డైరెక్టర్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ ఆరాధ్య స్లామ్ పాల్గొన్నారు. జాతీయస్థాయి సమృద్ధి విలేజ్ ఎంపికలో మూడు గ్రామాలను ఎంపిక చేయగా వీటిలో నారాకోడూరు గ్రామంను ఎంపిక చేసినట్లు తెలిపారు. దానిలో భాగంగానే క్షేత్రస్థాయిలో నారాకోడూరు గ్రామాన్ని కేంద్ర బృంద సభ్యులు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్య, వైద్య, వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సొసైటీ, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సచివాలయ సేవలకు సంబంధించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి వివిధ విషయాలను అడిగి తెలుసుకున్నారు. నారాకోడూరు గ్రామ సచివాలయాన్ని, వేజెండ్ల సొసైటీ కార్యాలయాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి శాంత కుమారి, పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, ఎంపీడీవో ఎ.ఉమాదేవి, తహసీల్దారు కె శ్రీనివాస శర్మ, ఈవోపీఆర్డీ టి ఉషా రాణి,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కమనీయం.. అంజన్న కల్యాణం



కల్యాణ క్రతువులో ఉత్సవ మూర్తులు



కల్యాణంలో పాల్గొన్న దంపతులు


చేబ్రోలు: చేబ్రోలు బ్రహ్మగుడి సమీపంలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి నాగవల్లీదళార్చన ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సువర్చలా సమేత వీరాంజనేయస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం రామనామ జయజయ ధ్వనులతో మార్మోగింది.

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణ, హోమాలు, నిర్వహించారు. శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణం కనుల పండువగా జరిపారు. హనుమత్ పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ వల్లూరు శ్రీనివాస శర్మ దంపతులు తలంబ్రాలు పోశారు. అనంతరం పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



నాగవల్లీదళార్చనలో వీరాంజనేయస్వామి

విజ్ఞాన్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఇద్దరు మొదటి సంవత్సరం విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ కేంద్రం (సీఈపీసీ), యూనివర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డుతో కలిసి విద్యార్థుల కోసం మూడు విభిన్న విభాగాలలో వ్యాస రచన, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారని వీసీ తెలిపారు. ఈ పోటీలలో తమ యూనివర్సిటీకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు చల్లా సంజనా(పెయింటింగ్), డి.నరేంద్రనాథ్(ఫొటోగ్రఫీ) విభాగాలలో రాష్ట్రస్థాయి కేటగిరీలో మొదటి విజేతలుగా నిలిచారన్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ మెమెంటోలు, ప్రామాణిక పత్రాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

కంపోస్టు ఎరువుతో పొలాలు సారవంతం



ఎరువులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శంకర్

ప్రత్తిపాడు: కంపోస్టు ఎరువుతో పొలాలను సారవంతం చేసుకోవచ్చని డ్వామా పీడీ వి.శంకర్ అన్నారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న కంపోస్టు పిట్‌ను శుక్రవారం ఆయన స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. గుంత ఎంత విస్తీర్ణంలో తీస్తున్నారు.. బిల్లుల చెల్లింపు వంటి అంశాలపై ఉపాధి అధికారులు పీడీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు, ప్రజలు కంపోస్టు ఎరువులను నిర్మించుకోవాలన్నారు. వీటి ద్వారా తయారైన ఎరువులను రైతులు పొలాంలో పిచికారీ చేసుకుంటే భూమి సారవంతమై, పంటలు దిగుబడులు బాగుంటాయని అన్నారు. అనంతరం రైతులకు కంపోస్టు పిట్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.జగన్‌మోహన్ రావు, టీఏ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలపై దృష్టి సారించాలి

సామాజికవేత్త రాజసుందరబాబు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సమస్యలపై దృష్టి సారించాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి లాడ్జిసెంటర్‌లోని ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ ప్రార్థన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మతోన్మాదులు చర్చిలోకి వెళ్లి అలజడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. పట్టణాలలో క్రైస్తవ మిషనరీల కాలంలో ఏర్పడిన సమాధులన్నీ మృతదేహాలతో నిండిపోయాయని, క్రైస్తవులు మృదేహాలను ఖననం చేసేందుకు కోసం అంగుళం భూమి కూడా లేదని, క్రైస్తవులకు రక్షణకు ప్రత్యేక చట్టం పాస్టర్ ప్రవీణ్ పేరుతో చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆరుమళ్ల మార్కు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, జాతీయ దళిత క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ పాల్గొన్నారు.